క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి. శంకరరావు, జిల్లా కార్యదర్శి ఎ. జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో కె. రామచంద్ర అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుమారి, బాబూరావు, రాజేష్, గౌరి, రామారావు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

30న ప్రవేశపరీక్ష

విజయనగరం ఫూల్‌బాగ్: నగరంలోని మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా ఫర్వీన్ తెలిపారు. అయ్యప్పనగర్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ఏడో తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీలున్నట్లు చెప్పారు. వీటికోసం 150 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

యూజర్ చార్జీల వసూళ్లలో వృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీరాములునాయుడు

విజయనగరం: క్లాప్ యూజర్‌చార్జీల వసూళ్లలో ఘనమైన వృద్ధి సాధించాలని సంబంధిత పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు ఆదేశించారు. బుధవారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యూజర్ చార్జీలను యుద్ధ ప్రాతిపదికన వసూలు చేయాలని సూచించారు.

నేటి నుంచి తోటపల్లి నీరు సరఫరా

నెల్లిమర్ల రూరల్: తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా గురువారం నుంచి సాగునీరు సరఫరా అవుతుందని డీఈ సుచిత్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లి ప్రధాన కాలువ నుంచి నెల్లిమర్ల, గుర్ల, గరివిడి మండలాలకు సాగునీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టామని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కాలువ నీరు వృథా కాకుండా, ముందుగా చెరువులు నింపుతామని చెప్పారు. తోటపల్లి పిల్ల కాలువల నుంచి నీరు మళ్లిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల నిరసన

విజయనగరం ఫూల్‌బాగ్: మహరాజా డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో పెంచిన సప్లిమెంటరీ, రీ వాల్యూయేషన్ ఫీజులు తగ్గించడంతో పాటు ప్రశ్నపత్రాన్ని రెండు మాధ్యమాల్లో ముద్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. హర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఆర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలలో ఎప్పుడూ లేని విధంగా ఫీజులు పెంచడం అన్యాయమన్నారు. విద్యార్థులకు ఇస్తున్న పరీక్ష పత్రాలు ఒక్క ఆంగ్లంలో ముద్రించడం వల్ల విద్యార్థులు ప్రశ్నాపత్రం అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని, తెలుగులో కూడా ముద్రిస్తే ప్రశ్నలు అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జె.రవికుమార్, ఎం. సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు పి. రమేష్ , సమీరా, టౌన్ కమిటీ సభ్యులు సోమేష్, వెంకటరమణ, ఎర్రమ్మ, సంధ్య, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక



రొంగలి మౌళిక

గుర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రొంగలి మౌళిక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(జాతీయ ఉపకార వేతనం)కు ఎంపికైందని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు జి.శ్రీరామ్ బుధవారం తెలిపారు. ఉపకారవేతనాలకు నిర్వహించిన పరీక్షలో ఈ విద్యార్థిని మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిందని ఆయన చెప్పారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

వైద్యాధికారికి సన్మానం



వైద్యాధికారి భాగ్యరేఖను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

జామి: స్థానిక పీహెచ్‌సీలో పనిచేసిన వైద్యాధికారి భాగ్యరేఖకు రెల్లివలస పీహెచ్‌సీకి బదిలీ అయింది. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు వనజ, సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఆమెను బుధవారం సత్కరించి వీడ్కోలు పలికారు. కరోనా సమయంలో ఆమె అందించిన సేవలను సిబ్బంది కొనియాడారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

- అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. పార్టీలు, కులమతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ముక్కాం సచివాలయ పరిధి కొంగవానిపాలెం గ్రామంలో మూడో రోజైన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ బంగారాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏపీఎం రమణ, ఏపీఓ ఆదిబాబు, తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు వర్తించాయా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి కూడా ఇంకా సంక్షేమ పథకాలు వర్తించకపోతే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాష్, సుందర హరీష్, వాసుపల్లి రొయ్యుడు, గండమాని రాము, నక్క అప్పలనర్సి, మత్స్యశాఖ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, అపురభుక్త పైడినాయుడు, సూరాడ చిన్నారావు, కర్రోతు శ్రీనివాసరావు, దుక్క రమణ, వెంకటరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెలీమానస్‌పై అవగాహన



టెలిమానస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు ప్రమీలాదేవి, తేజస్విని, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ టెలీమానస్ కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 14416 టెలీమానస్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమీలాదేవి మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, కుటుంబంలో కలహాలు, పనిలో ఒత్తిడి, ఓటమి భయం, ఒంటరితనం, సర్దుబాటు సమస్యలు, వ్యసనాలకు బానిస కావడం వంటి లక్షణాలు ఉన్నవారు 14416 జాతీయ లెలిమానస్ కార్యక్రమానికి ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు మౌనిక తేజస్విని, సీహెచ్ఓ వేదమణి, పీహెచ్‌సీ సిబ్బంది బంగారుబాబు, ఆర్‌వీ రమణ, మహేశ్వరి, నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

డెంకాడ: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా మండలంలోని చింతలవలస 5వ ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 30వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పి. అప్పలస్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలవలస, ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెల్లూరు ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుండీల ఆదాయం లెక్కింపు



లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఈఓ పద్మావతి, ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ ప్రాంతంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మూడు నెలలకు గాను 44,283 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ పద్మావతి తెలిపారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, శోభారాణి, రమణమ్మ, ఆలయ అర్చకులు సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు రమేష్ తివారీ, తదితరులు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సంతోషిమాత

విజయనగరం టౌన్: పట్టణంలోని మయూరి కూడలి వద్దనున్న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రమేష్ తివారీ నేతృత్వంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, గోమాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, కుంకుమపూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. పార్లమెంటు మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇది పేద ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం

- సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తమది పేద ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్యనారాయణరాజు(సురేష్ బాబు) అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధి కారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికీ కలిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమేనని అన్నారు. పార్టీల సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. మంచంపై నుంచి లేవలేని రోగుల ఇళ్లకు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్నారని, ఈకార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. తారు, గ్రావెల్, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నామని, మరో వైపు నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వసేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నామని, రిజిస్ట్రేషన్ల సేవలను కూడా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. సీఎం జగన్ నిరంతరం ప్రజల కోసం ఆలోచిస్తారని తెలిపారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్,ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి. నారాయణమూర్తి, కిలపర్తి అప్పలనాయుడు, కోడెల ముత్యాలనాయుడు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తుంపర సేద్య పరికరాల పరిశీలన

- మెరకముడిదాంలో పర్యటించిన మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ సంచాలకుడు



ఉత్తరావల్లిలో రైతులకు అందజేసిన తుంపర బిందు సేద్యం పైపులను పరిశీలిస్తున్న పథక సంచాలకుడు లక్ష్మీనారాయణ

మెరకముడిదాం: జిల్లావ్యాప్తంగా 2023–24 సంవత్సరానికి గాను రూ.687.17 లక్షల విలువైన సాగునీటి పరికరాల సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ పథక సంచాలకుడు పీఎస్‌వీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు మెరకముడిదాం మండలంలోని ఉత్తరావల్లి గ్రామంలో 15 మంది రైతులకు రూ.1 లక్ష 93 వేలు రాయితీ పోగా రూ.3 లక్షల 98 వేల విలువైన సూక్ష్మ తుంపర నీటిసేద్య పరికరాలను రైతులకు గతంలో అందజేశారు. వాటి వినియోగాన్ని ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరకముడిదాం మండలానికి సంబంధించి 46 మంది ఆసక్తి గల రైతులకు 125 ఎకరాల్లో రూ.28.63 లక్షల ఖర్చుతో తుంపరసేద్య పరికరాలను రాయితీపై సరఫరా చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అలాగే 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలను అందించనున్నామని తెలిపారు. 5 ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 55 శాతం రాయితీపై పరికరాలను సరఫరాచేయనున్నామన్నారు. అర్హులైన రైతులు తమ పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించాకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ మర్రాపు వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు ఘంటసాల సినీ సంగీత విభావరి

విజయనగరం టౌన్: ఘంటసాల, ఎస్పీ బాలు సినీ సంగీత విభావరిని గురువారం సాయంత్రం ఆరు గంటలకు ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాయిద్యకారులు సాయి పవన్ సంగీత నిర్వహణలో ఆపాతమధురాలను గాయకులు ఆలపిస్తారన్నారు.

నేడు బక్రీద్

విజయనగరం టౌన్: ముస్లింల పవిత్ర పర్వదినం బక్రీద్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జామియా మసీద్ కమిటీ ప్రతినిధి షేక్ రహీమ్ తెలిపారు. జామియా మసీదులో ఉదయం 7.30 గంటలకు, బోటీ మసీదులో ఉదయం 7 గంటలకు, మేమాన్ మసీదులో ఉదయం 6 గంటలకు, బాబామెట్ట మసీదులో 6.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధితో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ముస్లిం సోదరుడు నమాజ్ చేయాలన్నారు.

ఘనంగా జగన్నాథుని మారు రథయాత్ర



పూజలందుకుంటున్న జగన్నాథుడు

విజయనగరం టౌన్: జగన్నాథుని మారు రథయాత్ర మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. సంతపేట జగన్నాథునికి ఆలయ అర్చకులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద రథాన్ని నిలబెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సుమారు 700 ఏళ్ల నాటి ప్రముఖ వైష్ణవ దేవాలయమైన మన్నార్ రాజగోపాలస్వామి దేవాలయంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర ఆలయ ఈఓ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామిక బోర్డు డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కార్పొరేటర్ మీసాల రమాదేవి, మధు, అల్లు చాణక్య, సభ్యులు రామలింగస్వామి, బి. పండు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ డాక్టర్ మాటూరు సతీష్ , మద్దాల భాస్కరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు

విజయనగరం: అమ్మఒడి పథకం ప్రారంభోత్సవానికి పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. చినమేరంగి పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణంలోని హెలీపాడ్ వద్ద ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, విజయనగరం నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి , జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, తదితరులు ఉన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉప సంహరించుకోవాలని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కంది త్రినాథ్ అధ్యక్షతన బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచడంతో ప్రజలపై రూ. 1400 కోట్ల భారం పడిందన్నారు. గతంలో ఒకటి, రెండు సంవత్సరాలకోసారి చార్జీలు పెంచేవారని.. ప్రస్తుతం మాత్రం ప్రతి నెలా పెంచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు పెంచిన చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, రజక సంఘ జిల్లా నాయకులు భాస్కరరావు, చిన్నా, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ నాయకుడు ప్రసాద్, ఐద్వా జిల్లాకార్య దర్శి రమణమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ప్రయాణం..



గతంలో గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు



పునరుద్ధరణ పనుల తర్వాత శికారుగంజి-పి.లింగాలవలస పి.లింగాలవలస రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పి.లింగాలవలస గ్రామ తారురోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో ఆ గ్రామస్తుల అవస్థలు తీరాయి. జాతీయరహదారి–26 ను కలిపే శికారుగంజి బీటీ రోడ్డు నుంచి పి.లింగాలవలస వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డులో అడుగుకో గొయ్యితో అధ్వానంగా ఉండేది. దశాబ్దకాలంగా గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. గతంలో గృహసారథుల నియామకానికి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను గ్రామస్తులు కలిసి సమస్యను వివరించి, రోడ్డు బాగు చేయించాలని కోరారు. రోడ్డు పునరుద్ధరణ పనులు చేపడతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇచ్చినమాట ప్రకారం ఏఎంసీ నిధులు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. తాజాగా రోడ్డు పనులు పూర్తయ్యాయి. గతంలో ఈ రోడ్డున ప్రయాణం అంటే నరకాన్ని తలపించేదని, ఎమ్మెల్యే అప్పలనరసయ్య చొరవతో రోడ్డు వేయించడం ఆనందంగా ఉందని సర్పంచ్ కొత్తల మంగమ్మ,మాజీ సర్పంచ్ తాడు తెలిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణాలు సాఫీగా సాగుతున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.